క్లుప్తంగా

నందిగామలో బిగ్ స్క్రీన్ ఏర్పాటు

నందిగామ టౌన్: భారత్–ఆస్ట్రేలియా మధ్య ఆదివారం జరగనున్న వరల్డ్ కప్ ఫైనల్ మ్యాచ్‌కు భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నట్లు శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ క్రికెట్ అభిమానులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న హైటెన్షన్ ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు నందిగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రికెట్ అభిమానులు ఒకేచోట ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేలా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి లక్ష్మీరాజ్యం

నందిగామ: ప్రతిఒక్కరూ విద్యార్థి దశ నుంచే చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండడం అవసరమని సీనియర్ సివిల్ జడ్జి వి.లక్ష్మీరాజ్యం సూచించారు. మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎంజీహెచ్ పాఠశాలలో శనివారం సాయంత్రం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ విద్యార్థులకు బాలల చట్టాలు, హక్కులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చక్కగా చదివి అత్యున్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మట్టా ప్రసాద్, కొమ్మినేని మాశేశ్వరరావు, బి.భాస్కరరావు, చిరుమామిళ్ల శ్రీనివాసరావు, షేక్ ఆజాద్ పాల్గొన్నారు.

బీమా నగదు అందజేత



జగ్గయ్యపేట అర్బన్: కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న స్థానిక 26వ వార్డులోని షేక్ షేరుభాను శుక్రవారం మృతి చెందగా, ఆమె కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష మంజూరైంది. తొలుత మట్టిఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10వేలను వార్డు కౌన్సిలర్ పాకలపాటి సుందరమ్మ, మృతురాలి నామినిగా ఉన్న ఆమె సోదరుడు షేక్ ఇబ్రహీంకు అందజేశారు. మిగిలిన రూ.90వేలను మరణ ధ్రువీకరణపత్రం అందిన వెంటనే నామినీ బ్యాంకు ఖాతాలో జమవుతాయని కౌన్సిలర్ తెలిపారు. సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ శ్యామ్, అడ్మిన్ సెక్రటరీ జగన్ పాల్గొన్నారు.

ఆలయ వసతి గదులకు మరమ్మతులు పూర్తి


వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసియున్న యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం వద్దనున్న వసతి గదులకు రూ.10లక్షలతో మరమ్మతులు పూర్తిచేసి వసతి గదులను భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఈవో జయప్రకాష్‌బాబు తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వసతి గదులు మరమ్మతుల కారణంగా కొన్నినెలలుగా భక్తులకు అందుబాటులో లేవన్నారు. ఇటీవల ఆలయ వంశపారంపర్య ధర్మకర్త వెలగపూడి లక్ష్మణఇందిరాదత్ రూ.10లక్షలను మరమ్మతుల నిమిత్తం అందించగా, పనులను పూర్తి చేసినట్లు చెప్పారు. ఈనెల 20వ తేదీనుంచి ఆలయం వద్దనున్న వసతి గదులను భక్తులు వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు.

అక్రమ మద్యం రవాణాపై కేసు నమోదు



నందిగామ: అక్రమ మద్యం రవాణాకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామని పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. మండలంలోని కొణతమాత్మకూరు సమీపంలో గల రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్ట్ వద్ద శనివారం తెల్లవారుజామున పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో మధిర ప్రాంతం నుంచి ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై 158 తెలంగాణ మద్యం సీసాలను తీసుకుని వస్తుండగా గుర్తించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హనీష్ తెలిపారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు



మక్కపేట(వత్సవాయి) : ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మురుగుదొడ్లను వినియోగించుకోవాలని జల్‌జీవన్ మిషన్ జిల్లా ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ రామకృష్ణ నాగేశ్వరరావు సూచించారు. ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై శనివారం పోటీలను నిర్వహించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు– వాటి వినియోగంతో కలిగే ప్రయోజనాలపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ప్రతిభ చూపినవారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ రామాశేషాచార్యులు, హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గురుకిరణ్, హార్ట్ ఎన్జీవో కోఆర్డినేటర్లు హరికాలక్ష్మి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను



వైఎస్సార్ సీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉదయభాను, నాయకులు

ప్రభుత్వ విప్ ఉదయభాను

వత్సవాయి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజికన్యాయం సాధ్యమైందని జగ్గయ్యపేట ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను పేర్కొన్నారు. ఈనెల 24 న జగ్గయ్యపేటలో జరగనున్న సామాజిక సాధికార యాత్ర నేపథ్యంలో శనివారం సాయంత్రం ఆయన వత్సవాయిలో ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. తొలుత పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా వేలాదిగా పాల్గొని జగనన్న చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు మద్దతు పలకాలని కోరారు. ఈ నాలుగున్నరేళ్లలో జగ్గయ్యపేట నియోజకవర్గానికి అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద వేలాది కోట్ల రూపాయలను ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. సంక్షేమ పథకాల కింద వత్సవాయి మండలానికి నాలుగు వందల కోట్ల మేర ఇచ్చిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎటువంటి



సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

సిఫారసులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందన్న విషయాన్ని ప్రజలంతా గమనించాలన్నారు. గతంలో సంక్షేమ పథకాలు కావాలంటే జన్మభూమి కమిటీల వద్దకు చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. నేడు గ్రామ సచివాలయాల వద్దకు వెళితే అర్హత ఉంటే వలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే వస్తున్నాయని వివరించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక రాజకీయ పదవుల్లో కూడా సామాజిక న్యాయాన్ని కల్పించడం శుభపరిణామన్నారు. జగనన్న పాలనలో రాష్ట్ర ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఇంతటి ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలంతా అండగా ఉండాలని కోరారు. ఎటువంటి పొత్తులు లేకుండా నేరుగా ఎన్నికలలో పోటీచేయడం కేవలం వైఎస్సార్ సీపీకే సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గుత్తా శంకరరావు, జిల్లా పార్టీ కార్యదర్శి ఉపాధ్యక్షుడు చింతకుంట్ల వెంకటరెడ్డి, గాదెల రామారావు, సర్పంచ్ భూక్యా సీతమ్మ, ఎంపీపీ కొలుసు రమాదేవి, జెడ్పీటీసీ యేశపోగు దేవమణిశ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ లేళ్ల నాగేంద్రరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు సయ్యద్‌బాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రణ్‌హుస్సేన్, సర్పంచులు పొదిలి లక్ష్మీనారాయణ, కొట్టె నగేష్, బాణావతు శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షులు రంగిశెట్టి ముత్తయ్య, కాటేపల్లి రవి, కొండబోలు బ్రహ్మం, సామినేని లక్ష్మీనారాయణ, పెనుగొండ శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ నాయకులు గుండం రంగారెడ్డి, వేమిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, కనగాల రమేష్, చిరుమామిళ్ల ప్రభాకరరావు, అన్నెపాక నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రూ.27.27కోట్లతో అభివృద్ధి

పేట మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట పురపాలక సంఘంలో ప్రస్తుతం ఉన్న కౌన్సిల్ ఏర్పడిన రెండేళ్ల కాలంలో ఇప్పటివరకు రూ 27.27 కోట్లతో పట్టణాన్ని అభివృద్ధి చేసినట్లు మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తెలిపారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీలో వైఎస్సార్ సీపీ పాలకపక్షంగా ప్రస్తుతం ఉన్న కౌన్సిల్ ఏర్పడి రెండేళ్ల దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణాభివృద్ధికి చేసిన కృషి, ఖర్చు చేసిన నిధులు, చేపట్టిన పనులను పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలోని 111 మున్సిపాలిటీలలో రెండేళ్ల వ్యవధిలో రూ.27.27 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టిన మున్సిపాలిటీ జగ్గయ్యపేట కావడం సంతోషదాయకమన్నారు. ఇది 41ఏళ్ల మున్సిపల్ చరిత్రలో ఓ రికార్డుగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సహకారం, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కృషితోనే ఇది సాధ్యమైందంటూ వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇప్పటికి రూ.3.50 కోట్లతో పర్యాటక కేంద్రంగా చెరువు అభివృద్ధి పనులు, 1.90లక్షలతో పట్టణంలో రెండు ప్రాంతాల్లో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, రూ.60లక్షలతో ఉక్కు కళావేదిక(టౌన్‌హాల్) అభివృద్ధి, రూ.4.15లక్షలతో 18.20 కి.మీ పొడవున డ్రెయిన్ల నిర్మాణం, రూ.6.62 కోట్లతో 10.52 కి.మీ పొడవున రోడ్ల నిర్మాణం, రూ.96లక్షలతో



పేట అభివృద్ధిని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆర్.రాఘవేంద్ర

14.22 కి.మీ పొడవైన తాగునీటి పైపులైన్ ఏర్పాటు, చెరువుబజారులో రూ.53లక్షలతో రెండు బ్రిడ్జిల నిర్మాణం, మున్సిపల్ కార్యాలయంలో అన్ని విభాగాలను కార్పొరేట్ స్థాయిలోకి తీసుకువచ్చే లక్ష్యంతో ముందుగా చైర్మన్ ఛాంబర్, ఇంజినీరింగ్ విభాగాల రీమోడల్, మున్సిపల్ స్థలాలకు బోర్డులు, పార్కుతోపాటు కొత్త రైతుబజారు వద్ద టాయిలెట్ల నిర్మాణం తదితర అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. అదేవిధంగా రూ.1కోటి వ్యయంతో చిల్లకల్లు–పేట రోడ్ డివైడర్‌పై బటర్‌ఫ్లై లైట్లు, రూ.1కోటితో చెరువు చుట్టూ గ్రీనరీ, పట్టణంలో పలుచోట్ల హైమాక్స్ లైట్లు, శ్మశానవాటికల అభివృద్ధి, పట్టణ ఎంట్రన్స్‌లోని 31 వ వార్డులో 150 అడుగుల జాతీయజెండా, పార్కు నిర్మాణం, రూ.2 కోట్లతో జగనన్న కాలనీల్లో పైపులైన్లు, ప్రభుత్వాస్పత్రి వద్ద వాటర్ ఫాల్స్ తదితర పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, డీఈ, ఏఈలు శివకోటేశ్వరరావు, హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు



కంచికచర్ల గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



పేటలో మ్యూజికల్ చైర్స్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కంచికచర్ల : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఐదోరోజు శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. జూనియర్, సీనియర్స్ విభాగంలో నిర్వహించిన ఆయా పోటీలకు 64మంది విద్యార్థులు హాజరైనట్లు చెప్పారు. ఆయా పోటీల విజేతలకు వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో బహుమతులు అందజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ గ్రంథపాలకుడు రంగిశెట్టి రంగారావు, పీఈటీలు రాజేంద్రప్రసాద్, దీప, జల్లి కారల్‌మార్క్స్, ఎం. కనకారావు, బీడీసీలు శ్రీనివాసరావు, పేరయ్య, వరలక్ష్మి, నాగరాణి, శ్రీలక్ష్మి, ఆయా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామలో...

నందిగామ: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో పట్టణంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ విద్యార్థుల్లోని మేధస్సు, సృజనాత్మకతను వెలికితీసేందుకు ఆయా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈనెల 20వతేదీన వారోత్సవాల ముగింపు సభ ఉంటుందని, ఆరోజున ఆయా పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామని వివరించారు.

జగ్గయ్యపేట పట్టణంలో..

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. అంతకుముందు గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ఉపాధ్యాయురాలు శారద మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకటరమణయ్య, పాతూరి నాగభూషణం చేసిన కృషిని వివరించారు. సాయంత్రం నిర్వహించిన సాహితీ కార్యక్రమంలో కొడాలి బాలగంగాధరతిలక్, ఉపాధ్యాయుడు ప్రసాద్ బాబు పాల్గొని వ్యక్తిత్వ వికాసంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, ఉపాధ్యాయుడు దోసపాటి నాగేశ్వరరావు, బీడీసీ నాగమల్లిక, సత్యవతి పాల్గొన్నారు.

నైపుణ్యం వెలికి తీసేందుకు టాలెంట్ హంట్

మైలవరం: విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకు టాలెంట్ హంట్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం టాలెంట్ హంట్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో డ్యాన్స్, పెయింటింగ్, రీల్స్, రంగోలి, మిమిక్రీ, క్విజ్, మ్యూజిక్, స్కిట్స్, సింగింగ్ తదితర పది రకాల ఈవెంట్స్‌పై కళాశాల విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు కల్చరల్ యాక్టివిటీస్‌పై కూడా పట్టు సాధించాలన్నారు. విజేతలను మచిలీపట్నం కృష్ణా యూనివర్సిటీలో నవంబర్ 30, డిసెంబర్ 1, 2 తేదీలలో జరిగే కృష్ణ తరంగ్–2023కు కళాశాల తరఫున పంపనున్నట్లు తెలిపారు.

ప్రతిభా స్కాలర్‌షిప్‌కు ఎంపిక

తిరువూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు కేంద్రప్రభుత్వ మానవ వనరుల శాఖ ఇచ్చే ప్రతిభా స్కాలర్‌షిప్‌లకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. ఇంటర్మీడియట్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున నాలుగు సంవత్సరాల పాటు ఈ ఉపకారవేతనం లభిస్తుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

ప్రింటర్ బహూకరణ



ప్రింటర్‌ను బహూకరిస్తున్న ఉపాధ్యాయులు

నందిగామ: మండలంలోని కొండూరు ప్రాథమికోన్నత పాఠశాలకు గతంలో ఇదే పాఠశాలలో పనిచేసిన ప్రధానోపాధ్యాయుడు సిహెచ్ నరసింహారావు, ఉపాధ్యాయులు ఎం.రామకృష్ణ, గంగాధర్, జ్యోతి కలసి రూ.20వేలు విలువచేసే ప్రింటర్, స్కానర్, జిరాక్స్ మిషన్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం రాజ్యలక్ష్మి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మైక్ సెట్ అందజేత



ఎమ్మెల్యేకు మైక్‌సెట్‌ను అందజేస్తున్న చారుగుండ్ల

జగ్గయ్యపేట అర్బన్: వైఎస్సార్ సీపీ జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యాలయానికి ఆ పార్టీ వాణిజ్య విభాగం పట్టణ అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ చారుగుండ్ల కొండ రూ.17వేల విలువగల మైక్‌సెట్‌ను బహూకరించారు. మైక్‌సెట్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు ఆయన నివాసంలో అందజేయగా, చారుగుండ్ల కొండను ఉదయభాను అభినందించారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లకు 26వ తేదీ తుదిగడువు

నందిగామ: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ద్వారా పదోతరగతి, ఇంటర్మీడియట్ చదివేందుకు ఈనెల 26వ తేదీ వరకు అవకాశం ఉందని ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్. బాబురావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రూ.200 అపరాధ రుసుముతో ఈనెల 30వ తేదీ లోగా అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఆసక్తి గలవారు ఇతర వివరాలకు సెల్‌నంబరు 89776 45706కు సంప్రదించాలని ఆయన సూచించారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

పెద్దాపురం(వీరులపాడు): మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్‌ఐ మహాలక్ష్మణుడు తెలిపారు. మండలంలోని పెద్దాపురం సమీపంలోని అవుట్ పోస్టు వద్ద శనివారం ఆయన వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతరాష్ట్ర సరిహద్దు గ్రామాల వద్ద నిఘాను కట్టుదిట్టం చేశామన్నారు. ప్రతి వాహనాన్ని తనిఖీ చేసిన తర్వాతే అనుమతిస్తున్నామన్నారు. ముఖ్యంగా మద్యం అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన ఆదేశించారు. విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని సిబ్బందిని హెచ్చరించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

22 నుంచి శోభనాచలుడి బ్రహ్మోత్సవాలు

ఆగిరిపల్లి: జిల్లాలో ప్రసిద్ధి గాంచిన ఆగిరిపల్లి శోభనగిరిపై వెలిసిన శ్రీ శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వార్ల వార్షిక బ్రహ్మోత్సవం, కృత్తిక దీపోత్సవ కార్యక్రమాలను ఈ నెల 22 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ ఎన్.భవాని, ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు శనివారం తెలిపారు. 24న శ్రీవారి శోభనగిరి ప్రదక్షిణ, 25న కొండపై మూడు గుళ్ల వద్ద స్వామికి శాంతి కల్యాణం, 26న దివ్య తిరుకల్యాణం, గరుడ వాహనోత్సవం, 27న చక్రస్నానం, సాయంత్రం ఆలయం కోవెల వద్ద కృత్తిక దీపోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రకటన

ఈ క్రింద ... Shriram Finance Ltd, ... [illegible]

జగ్గయ్యపేట
తేది:18-11-2023

రాయపూడి శ్రీనివాసరావు
అడ్వకేట్ & నోటరీ, సెల్: 98484 12820
Enrolment Number: 1370/1987

భక్తిశ్రద్ధలతో ఇరుముడుల కార్యక్రమం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు



ఇరుముడులు కట్టించుకుంటున్న దీక్షా పరులు

నందిగామ టౌన్: పట్టణంలో వేంచేసియున్న వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం వెంకటేశ్వర స్వామి వారి దీక్షా స్వాముల ఇరుముడుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే స్వామి వారి నామస్మరణతో ఆలయ ఆవరణ మార్మోగింది. నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికి పూజల అనంతరం ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం దీక్షాపరుల ఇరుముడుల కార్యక్రమంలో ఎమ్మెల్యే జగన్ మోహనరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో వార్డు కన్వీనర్ నాదెండ్ల నరేంద్ర, భక్తులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు అనూహ్య స్పందన లభిస్తోందని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను తెలిపారు. స్థానిక ఎస్‌జీఎస్ కళాశాలలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పేట మండలం, చిల్లకల్లులోని బీసీ కాలనీకి చెందిన టీడీపీ నాయకుడు, ఉపసర్పంచ్ బత్తుల ఏడుకొండలు, పట్టణంలోని రంగబజారుకు చెందిన టీడీపీ మైనార్టీ విభాగం నాయకుడు షేక్ మూసా ఆపార్టీని వీడి వైఎస్సార్ సీపీలోకి చేరారు. వీరికి సామినేని ఉదయభాను, పార్టీ నియోజకవర్గ యువనాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే ఉదయభాను మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తూ సామాజిక న్యాయాన్ని పాటిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని కొనియాడారు. సీఎం జగన్ చేపట్టిన సామాజిక యాత్ర ప్రభావంతో అనేకమంది వైఎస్సార్ సీపీలోకి చేరుతున్నారని తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



టీడీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ఉదయభాను

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 17మంది ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ రామ్మోహనరావు, ప్రిన్సిపాల్ శశిధర్

కంచికచర్ల (వీరులపాడు) : కంచికచర్ల మండలంలోని పరిటాల అమ్రితసాయి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ సెలక్షన్స్‌లో 17మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శశిధర్ శనివారం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బ్రాడ్ టెక్స్ ప్రైవేటు లిమిటెడ్‌కు చెందిన ప్రతినిధులు ఎంసీఏ, బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు మౌఖిక, రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, టెక్నికల్, హెచ్ఆర్ ఇంటర్వ్యూలు నిర్వహించారన్నారు. ఈ సెలక్షన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన 17మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఎంపికైన వారికి వార్షిక వేతనం రూ.2లక్షలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ మేరకు విద్యార్థులకు నియామక పత్రాలను కూడా అందజేశారని వివరించారు. 2023–24లో విద్యాసంవత్సరంలో ఇప్పటివరకు కళాశాల నుంచి 191మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారన్నారు. తమ కళాశాలలో నాణ్యమైన సాంకేతిక విద్యనందించటంతోపాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా మెరుగైన విద్యను అందిస్తున్నామని ప్రిన్సిపాల్ వివరించారు. అనంతరం కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రామ్మోహన్ రావు, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీదేవి, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ పి.చిరంజీవి, ప్లేస్‌మెంట్ కోఆర్డినేటర్ వి.రామారావు, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు కలిసి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే విమర్శలు

పోచంపల్లి(జగ్గయ్యపేట): పోచంపల్లి గ్రామాభివృద్ధిని చూసి ఓర్వలేకే తనపై, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై టీడీపీ నాయకులు అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ వైస్ ఎంపీపీ బూతుకూరి నాగిరెడ్డి పేర్కొన్నారు. తన నివాసంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాలుగున్నరేళ్ల పాలనలో పోచంపల్లి ఎంతో అభివృద్ధిని సాధించిందని చెప్పారు. ముఖ్యంగా గ్రామం నుంచి జాతీయ రహదారి వరకు ప్రతిష్టాత్మకంగా రూ. రెండు కోట్లతో రోడ్డు నిర్మాణం చేపట్టామని ఆ రోడ్డుపై కూడా మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీ సర్పంచ్ ముల్లంగి రామకృష్ణారెడ్డి అసత్య ఆరోపణలు చేయడం హేయమైన చర్యగా అభివర్ణించారు. టీడీపీ హయాంలో గ్రామంలో ఏమి అభివృద్ధి పనులు చేపట్టారో చూపించాలని డిమాండ్ చేశారు. గతంలో చుట్టుపక్కల గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లు నిర్మిస్తే అదేసమయంలో సర్పంచిగా ఉన్న రామకృష్ణారెడ్డి పోచంపల్లిలో 30శాతం మేర కూడా అభివృద్ధి చేయలేదని విమర్శించారు. కానీ నేడు గ్రామంలో అభివృద్ధి జరుగుతుంటే చూసి ఓర్వలేకనే తనపై, పార్టీపై బురదజల్లే వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. గ్రామ అవసరాల నిమిత్తమే క్వారీ నుంచి గ్రావెల్ తవ్వుతుంటే, అక్రమరవాణా అని పేర్కొనడం సబబు కాదన్నారు. వాస్తవాలను గుర్తెరిగి మాట్లాడాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు. సమావేశంలో సర్పంచ్ బూతుకూరి లక్ష్మి, సొసైటీ చైర్మన్ పెడవల్లి పరమేశ్వరరావు, పార్టీ గ్రామ కన్వీనర్ మన్నె శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ ఇరుగు రమేష్, నాయకులు పెద్ది రామిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న నాగిరెడ్డి, నాయకులు